
# సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 1 । నవంబర్ । 2023





**సోమశిలలో 30.133 టీఎంసీలు**

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం 30.133 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 99 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | -రూ.63,250 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) | - రూ.5,711 |
| 3 శాతం జీఎస్టీతో.. | - రూ.5,882 |
| నవర (8 గ్రా) | - రూ.47,056 |

గరిష్టం/కనిష్టం
34.2 /24.7

**వాతావరణం**

మంగళవారం గాలిలో తేమ 71 శాతం ఉంది. బుధవారం ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### నేటి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీకి జిల్లా యంత్రాంగం చర్యలు పూర్తి చేసింది. బుధవారం ఉదయం నుంచి నుంచి పింఛన్ కానుకను వలంటీర్లు పంపిణీ చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 3,18,870 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.88.62 కోట్లు పంపిణీ చేయనున్నారు. వలంటీర్లు వేకువజాము నుంచే పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. అలాగే లబ్ధిదారులు ఎక్కడ ఉంటే ఆయా ప్రాంతాలకు వలంటీర్లు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తారు.

### నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జిల్లాస్థాయిలో బుధవారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గార్డ్ ఆనర్, 10.10 గంటలకు పతాకావిష్కరణ, 10.20 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేయడం, 10.30 గంటలకు అమరజీవికి నివాళులర్పిస్తూ ప్రసంగం, 10.45 గంటల నుంచి 12.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. సంబంధిత జిల్లా అధికారులు రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

### తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రవ్యాప్తంగా 39 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరులోని నుడాలో పనిచేస్తున్న తలమంచి వెంకటసునీల్, గూడూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న లీలారాణి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందారు.

### 8 నుంచి మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం'

• కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం ఎంపిక చేసిన మండల కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయయన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ నెలకు సంబంధించిన షెడ్యూల్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ నెల 8న అల్లూరు, 10న సైదాపురం, 15న ఉదయగిరి, 17న దుత్తలూరు, 22న ఉలవపాడు, 24న అనంతసాగరం, 29న వరికుంటపాడు మండల పరిషత్ కార్యాలయాల్లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి బుధ, శుక్ర వారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం (స్పందన) తరహాలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### కబడ్డీ చాంపియన్ ఎస్‌ఆర్‌జే



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరురూరల్: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల కబడ్డీ, చెస్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఆత్మకూరులో జరిగిన ఈ పోటీల్లో కబడ్డీ చాంపియన్‌గా ఆత్మకూరు డాక్టర్ ఎస్‌ఆర్‌జే డిగ్రీ కళాశాల జట్టు, రెండో స్థానంలో కావలి శ్రీసాయి కళాశాల జట్టు నిలిచాయి. చెస్ పోటీల్లో విజేతగా నెల్లూరు జెనెక్స్ కళాశాల జట్టు, రన్నర్‌గా కావలి శ్రీచైతన్య కళాశాల జట్టు నిలిచాయి. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ వరకుమారి, యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు చేతులమీదుగా ట్రోఫీలు ప్రదానం చేశారు.



## ఆలస్యం లేదిక..
# చెంతనే పరిష్కార వేదిక

ప్రజలు గ్రామస్థాయిలో, వ్యక్తిగత సమస్యలు ఉన్నప్పుడు స్థానిక ఎమ్మెల్యే పర్యటించినప్పుడు గానీ, లేదా ఆయన నివాసానికి వెళ్లి విన్నవించుకుంటారు. ఎమ్మెల్యే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతారు. ఇవన్నీ జరగాలంటే కొంత సమయం పడుతుంది. కానీ ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గ్రామస్థాయిలోనే గ్రామ సచివాలయాలను వేదికగా చేసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇందుకోసం నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.



మర్రిపాడు మండలం నందవరంలో సమస్య పరిష్కరించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఫైల్)

- నియోజకవర్గంలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి సమస్యకు ఒక నంబర్, పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షణ
- గ్రామ, మండల స్థాయిల్లో కోఆర్డినేటర్ల నియామకం
- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తన వద్దకు రాకుండానే సచివాలయంలో వినతిపత్రం అందజేస్తే ఆ సమస్య తన దృష్టికి వచ్చి పరిష్కారమయ్యేలా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా సమస్యలు గ్రామస్థాయిలోనే ఎక్కడికక్కడ పరిష్కారమవుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**'గడప గడపకు' కార్యక్రమం స్ఫూర్తితోనే..**

మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు కార్యాచరణను రూపొందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారు. అందులో భాగంగా ముందుగా గ్రామాల్లో ఇద్దరు ప్రతినిధులను ఏర్పాటు చేసి గ్రామాల్లోని వలంటీర్ల ద్వారా వారి పరిధిలో ఉన్న ప్రజల సమస్యలను నమోదు చేస్తున్నారు. ఉమ్మడి సమస్యలు, వ్యక్తిగత సమస్యలను వేరు చేసి వాటిని నమోదు చేసి 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించే సమయానికి ఏ మేరకు పరిష్కరించవచ్చో వాటిని పరిష్కరిస్తూ సమస్యల నివేదికను కంప్యూటరీకరణ చేశారు. ఇందుకోసం సచివాలయం స్థాయిలో ఎప్పటికప్పుడు సమస్యల స్థితిగతులను పర్యవేక్షించేందుకు సచివాలయ ఉద్యోగికి అదనంగా బాధ్యతలు అప్పగించారు. దీంతోపాటు మండలస్థాయిలో ఒక ప్రతినిధిని ఏర్పాటు చేశారు. ప్రతి నెలా గ్రామాల్లోని సమస్యలపై సమీక్షిస్తూ కొత్తగా వచ్చే సమస్యలను నమోదు చేస్తూ వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కృషి చేస్తున్నారు. రేషన్ కార్డులు, సామాజిక పింఛన్లు, రెవెన్యూ సమస్యలైనటువంటి సాదా బైనామా, చుక్కల భూములు, పాస్‌బుక్‌లు, భూమి హద్దులకు సంబంధించి ఎప్పటికప్పుడు అధికారులతో నెల వారీ సమీక్షలు నిర్వహిస్తున్నారు. సమస్యలు పరిష్కారమైన వాటికి సంబంధించి ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు కలెక్టర్, ఎంపీ, రాజ్యసభ సభ్యుల నిధులతోపాటు జెడ్పీ నిధులను కూడా ఎప్పటికప్పుడు మంజూరు చేయించుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉండడంతో ప్రతి నెలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్దేశిత గడువు లోపు సమస్యలు పరిష్కారమయ్యేలా ప్రయత్నిస్తున్నారు.

మండలాల వారీగా వచ్చిన విజ్ఞప్తులు

| మండలం | అందిన అర్జీలు | పరిష్కార మైనవి | పరిశీలనలో ఉన్నవి |
|---|---|---|---|
| మర్రిపాడు | 4,754 | 1,210 | 3,544 |
| ఏఎస్‌పేట | 2,359 | 1,054 | 1,305 |
| ఆత్మకూరు | 2,739 | 1,914 | 825 |
| ఆత్మకూరు పట్టణం | 3,333 | 1,688 | 1,645 |
| సంగం | 4,578 | 1,536 | 3,042 |
| చేజర్ల | 3,868 | 1,650 | 2,218 |
| అనంతసాగరం | 2,920 | 1,940 | 980 |
| మొత్తం | 24,551 | 10,992 | 13,559 |

### నమోదు ఇలా..

గ్రామాల్లో ఉమ్మడి లేదా వ్యక్తిగత సమస్య ఉన్నట్లయితే ప్రజలు వారి వలంటీర్‌కు సమస్యను తెలియజేయాలి. సమీప సచివాలయంలో కూడా తెలియపరచాలి. ఒక వేళ ఎమ్మెల్యే కార్యాలయంలో తెలియజేసినా ఆన్‌లైన్‌లో వారి ఫోన్‌నంబర్‌తో సమస్య నమోదవుతుంది. గ్రామంలో అభివృద్ధి అంశానికి సంబంధించి నిధుల విషయంపై సంబంధిత శాఖకు తెలియపరుస్తారు. ఎప్పటికప్పుడు సమస్య పరిష్కార స్థితిని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ప్రజా విజ్ఞప్తులపై ఒక ప్రత్యేక బృందం నిరంతరం పర్యవేక్షణ కొనసాగించేలా ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు.

### గ్రామస్థాయిలోనే పరిష్కారం



ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహణ చాలా ఉపయోగకరంగా ఉంది. ప్రజలు సమీప సచివాలయంలో తమ సమస్యలపై అర్జీ ఇస్తే ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

– ఆర్.వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, అనంతసాగరం మండలం

### ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షలు



ప్రజల నుంచి అందిన అర్జీల్లో ఎక్కువగా ఉండే సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షలు నిర్వహించడం, కొన్ని అక్కడికక్కడే పరిష్కరించడం చాలా బాగుంది. సమస్య పరిష్కారం అయిన వెంటనే అర్జీదారుడి సెల్‌ఫోన్‌కు సమాచారం ఇస్తున్నారు.

– సీహెచ్ జితేంద్రనాగ్‌రెడ్డి, మహిమలూరు

# సంక్షేమం, అభివృద్ధి వైపు పరుగులు

• ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో అమృత్ 2.0 పథకం ద్వారా రూ.85 కోట్లతో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మంచినీటి సరఫరా అభివృద్ధి పథకానికి మంగళవారం ఎంపీ వేమిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మంచినీటి పథకానికి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని, కోవూరు ఎమ్మెల్యే ఏదైనా పని అనుకుంటే అది పూర్తయ్యే వరకు వెంటాడుతారని తెలిపారు. రూ.85 కోట్లతో ఇంత పెద్ద ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయడం ఒక చరిత్ర అన్నా రు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెంలో బెజవాడ గోపాల్‌రెడ్డి స్మారకార్థం రూ.కోటి నిధులతో పార్కును నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు.



తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

**ప్రతి ఇంటికీ తాగునీరు**

ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేసిన మంచినీటి ప్రాజెక్ట్ ద్వారా బుచ్చి నగర పంచాయతీలో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. ఎంజీఆర్ సంగం బ్యారేజ్ వద్ద ఇంటెక్ వెల్ నిర్మించి అక్కడి నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి డిస్ట్రిబ్యూషన్ పైపుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ రావడానికి సహకారం అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మున్సిపల్ శాఖ మంత్రితోపాటు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మికి ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు, కల్యాణ్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, ఏపీఎల్పీఏ చైర్మన్ విజయకుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సాహుల్, లలితారెడ్డి, మోర్ల మురళి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంటల ప్రణాళిక సిద్ధం చేయండి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సాగునీటి లభ్యత, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరా, పంటల సీజన్‌లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణపై దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ నీటిపారుదల, వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రైతులను ఏవిధంగా ఆదుకోవాలో ఆలోచన చేయాలన్నారు. భూములను బట్టి మండలాల వారీగా పంటల ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. రైతులతో సమావేశం నిర్వహించి నీటి లభ్యతను బట్టి పంటలు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులు నష్టపోకుండా ఉన్న ప్రతి పంటకు పంటల బీమా చేయించాలని, ఉద్యానశాఖలో డ్రిప్ ఇరిగేషన్ విరివిగా ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి కొరత రాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని సోమశిల, కండలేరు తదితర జలాశయాల్లో నీటి నిల్వలు ఎంత ఉన్నది, తాగునీటికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు ఎంత అవసరం ఉందనే అంశాలపై ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఉన్న దృష్ట్యా తాగునీటి కోసం కేటాయించిన నీరు ఇతర అవసరాలకు మళ్లించకుండా చూడాలన్నారు. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిస్థితి ఆశాజనకంగా ఉండి రైతులకు మేలు జరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, సోమశిల ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రంగప్రసాద్, తెలుగు గంగ ఎస్‌ఈ హరినారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, కండలేరు, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈలు, ఇరిగేషన్ ఈఈలు, డీఈలు, వ్యవసాయశాఖ ఏడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

# అభ్యసన సామర్థ్యాలపై ఫోకస్

- 3, 6, 9 తరగతుల సామర్థ్యాలపై మదింపు
- ఈ నెల 3న పాఠశాలల్లో సీస్ సర్వే
- జిల్లాలో 1,403 పాఠశాలల ఎంపిక
- సర్వే పరీక్షకు హాజరుకానున్న 34 వేల మంది విద్యార్థులు
- జాతీయ స్థాయిలో ర్యాంకులు



నెల్లూరు(టౌన్): ఎవరూ చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించింది. జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, సీబీఎస్‌ఈ సిలబస్ అమలు, ఇంగ్లిషు మీడియం, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, పాఠశాలల్లో వర్చువల్ బోధన, ప్రతి మండలంలో బాలికలకు ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు తదితర కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటోంది. అంతేకాకుండా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకునేందుకు స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్)ను ఈ నెల 3న నిర్వహించనున్నారు. ఆయా పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీస్ సర్వే నిర్వహించనున్నాయి. ఈ సర్వేకు సంబంధించి విద్యార్థులు ఇప్పటికే ప్రాక్టీసును ప్రారంభించారు.

**పాఠశాలల్లో సీస్ సర్వే**

జిల్లాలో సీస్ సర్వేకు సంబంధించి 1,403 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లోని 34 వేల మంది విద్యార్థులు సీస్ సర్వేకు హాజరుకానున్నారు. ఈ సర్వే ఆధారంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. అదే సమయంలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని కూడా అంచనా వేయవచ్చు. తద్వారా విద్యా వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తెచ్చేందుకు వీలవుతుంది. అభ్యసనలో బలహీనంగా ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని మరింత మెరుగుపరిచేలా చర్యలు చేపట్టనున్నారు.

**క్షేత్ర పరిశోధనకు డిగ్రీ విద్యార్థుల ఎంపిక**

సీస్ సర్వేకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు(క్షేత్రస్థాయి పరిశోధకులు)గా డిగ్రీ చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సర్వే మొత్తం 1,647 మంది డిగ్రీ విద్యార్థుల పర్యవేక్షణలో జరగనుంది. ఇందుకు సంబంధించి ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. జిల్లాస్థాయిలో డీఈఓ పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్రశిక్ష ఏఎంఓ, డైట్ ప్రిన్సిపల్/అధ్యాపకులు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నారు. అలాగే మండల స్థాయిలో ఎంఈఓ–1, 2, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు పర్యవేక్షించనున్నారు. గతంలో నిర్వహించిన సర్వే ఆధారంగా 3, 5, 8 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా, ఈ ఏడాది సీస్ సర్వేలో 3, 6, 9 తరగతులకు సర్వే నిర్వహిస్తున్నారు. నిర్వహణకు ముందుగా విద్యార్థులకు ఎస్‌సీఈఆర్టీ ప్రాక్టీస్ పేపర్లను సరఫరా చేసింది.

### జాతీయ స్థాయిలో ర్యాంకులు



స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్షలో వచ్చిన ఫలితాల ఆధారంగా విద్యార్థులకు జాతీయస్థాయిలో ర్యాంకులను కేటాయించనున్నారు. సీస్ పరీక్ష ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఫోకస్ పెట్టనున్నాం. ఫలితాల ఆధారంగా తగిన తర్ఫీదును ఇవ్వనున్నాం. ఎంపికైన విద్యార్థులు సీస్ పరీక్షకు తప్పక హాజరుకావాలి. పరీక్ష నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– గంగాభవాని, డీఈఓ

### ఓఎంఆర్ విధానంలో పరీక్ష

సీస్ సర్వే పరీక్షను ఈ నెల 3న ఉదయం 10.30కు ప్రారంభించనున్నారు. పరీక్ష ఓఎంఆర్ విధానంలో ఉంటుంది. 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిషు, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిషు, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి పరీక్షను నిర్వహించనున్నారు. 3వ తరగతి విద్యార్థులకు గంట, 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల పాటు సీస్ సర్వే పరీక్షను నిర్వహించనున్నారు. 3వ తరగతి విద్యార్థులకు 3వ తరగతి సిలబస్‌పై, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సిలబస్‌పై, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష ఉంటుంది. ఈ సర్వే పరీక్ష ఫలితాల అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు మదింపు చేయనున్నారు.

## క్లుప్తంగా

### బడిబయట బాలికలను గుర్తించండి

• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట) : గ్రామీణ ప్రాంతాల్లో బడిబయట బాలికలను గుర్తించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మండలాధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి జిల్లాలోని మండలాధికారులతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. బడిబయట ఉండే బాలికలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ ఆడిట్ ప్రక్రియను అన్ని మండలాల్లో పూర్తి చేయాలన్నారు. జెండర్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రతినెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు లింకేజ్ రుణాల లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను వంద శాతం రికవరీ చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

### అతిథిదేవోభవ

• ఇటలీ పర్యాటకులకు ఎస్సై ఆతిథ్యం



పర్యాటకులకు కృష్ణుడి విగ్రహాన్ని అందజేస్తున్న ఎస్సై విశ్వనాథరెడ్డి

మర్రిపాడు : భారతదేశంలో ప్రముఖ దేవాలయాలు, పర్యాటక స్థలాల సందర్శన కోసం మర్రిపాడుకు వచ్చిన ఇటలీకి చెందిన దంపతులకు మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి మంగళవారం ఆతిథ్యం అందించారు. ఇటలీకి చెందిన దంపతులు దేశ పర్యటనలో భాగంగా జిల్లాలోని మర్రిపాడుకు చేరుకున్నారు. స్థానికంగా విశ్రాంతి కోసం పలువురిని ఆశ్రయించగా కానిస్టేబుల్ రామకృష్ణ వారిని ఎస్సై విశ్వనాథరెడ్డి వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై వారికి అతిథి మర్యాదలు చేసి జిల్లాలోని ప్రముఖ ఆలయాలు, ప్రాజెక్టుల గురించి వివరించారు. భారతీయ సాంస్కృతి గురించి వారి వివరించి శ్రీకృష్ణుడి విగ్రహాన్ని వారికి బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా వారి సందర్శించాల్సిన ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, రంగనాథస్వామి ఆలయం, బారాషహీద్ దర్గా తదితర ప్రాంతాల పర్యటన కోసం వారికి మ్యాప్ పాయింట్లు సైతం తెలియజేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తల్లి స్వగ్రామమే తమ ఊరు అని పర్యాటకులు తెలిపినట్లు ఎస్సై వివరించారు.

# 3న టిడ్కో ఇళ్ల పంపిణీ

• ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట, అధికారులు

కందుకూరు : గత ప్రభుత్వం సగంలో వదిలేసిన టిడ్కో ఇళ్లను మౌలిక వసతులతో సిద్ధం చేశామని, ఈ ఇళ్లను ఈనెల 3వ తేదీ లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పుచెరువు ప్రాంతంలోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్ద 14.50 ఎకరాల విస్తీర్ణంలో 1408 టిడ్కో గృహాల సముదాయాన్ని ప్రభుత్వం నిర్మించిందన్నారు. గత ప్రభుత్వం ఈ గృహాలను అసంపూర్తిగా వదిలేయడంతో పాటు, మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులన్నీ పూర్తి చేసినట్లు తెలియజేశారు. మూడు కేటగిరీలుగా నిర్మించిన ఇళ్లలో 300 చదరపు అడుగులు(చ.అ) విస్తీర్ణం ఇళ్లను కేవలం ఒక రూపాయికి మాత్రమే అందజేస్తుందన్నారు. మొత్తం 544 మందికి ఈ కేటగిరి కింద ఇళ్లు మంజూరయ్యాయని, వీరికి రూ.39.1 కోట్ల లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అలాగే 365 చ.అ విస్తీర్ణం ఉన్న ఇళ్లకు గతంలో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 వేలు ఉండేదని, దీనిని రూ.25 వేలకు, 430 చ.అ ఫ్లాట్స్‌కు రూ.లక్ష నుంచి రూ.50 వేలకు రిజిస్ట్రేషన్ ఫీజుని ప్రభుత్వం తగ్గించిందన్నారు. దీని వల్ల రూ.3.12 కోట్ల లబ్ధి కలిగిందన్నారు. ప్రస్తుతం 187 మంది మాత్రమే వివిధ కారణాలతో ఇళ్లు పొందేందుకు అనర్హులైయ్యారని, కొందరు ఇళ్లు మంజూరైనా తీసుకునేందుకు ఇష్టపడలేదని చెప్పారు. వారికి నోటీసులు ఇచ్చి మరో అవకాశం ఇస్తామన్నారు. టిడ్కో ఎస్ఈ చినకోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

# వినూత్న పథకాలతో పేదలకు మేలు



వృద్ధురాలికి కేస్‌షీట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలతో పేదలకు మేలు జరుగుతోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. నాగులవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యనిపుణులు గ్రామస్తులకు అందిస్తున్న వైద్యసేవలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల కష్టాలు తీర్చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పాలన ప్రజల ముంగిటకే వచ్చిందన్నారు. అదేవిధంగా ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి నివేశన స్థలాలు మంజూరు చేయడంతో పాటు పక్కా ఇంటిని కట్టించి ఇస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలతో కొత్తగా గ్రామాలే ఏర్పడుతున్నాయని వివరించారు. మహిళలకు అండగా చేయూత, డ్వాక్రా రుణాలు, రైతుల కోసం రుణ మాఫీ, రైతు భరోసా కేంద్రాలు, పంటల బీమా, యువత కోసం ఉపాధి కల్పన, విద్యార్థులకు నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేయడం, వృద్ధుల కోసం ప్రతినెలా ఇంటి వద్దనే పింఛన్లు, రేషన్ సరుకులు అందించడం తదితర పథకాలు పాలనలో నూతన శకానికి నాంది పలికాయని వివరించారు. కార్యక్రమంలో కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్, తహసీల్దార్ హేమంత్, ఎంపీడీఓ సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, జెడ్పీటీసీ సభ్యురాలు మద్దిబోయిన కీర్తన, సచివాలయాల మండల కన్వీనర్ సురేందర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యువత్ అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

• ఇన్‌చార్జి సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డి



ఫారెస్ట్ రేంజర్లతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(బారకాసు) : అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఇన్‌చార్జి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్(గుంటూరు) శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఫారెస్ట్ రేంజర్లతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, వన్యప్రాణుల రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. క్యాలెండర్ ప్రకారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే బాధ్యత క్షేత్ర స్థాయి అధికారులదేనన్నారు. వన్యప్రాణ వేటను అరికట్టాలని, అటవీ ఆక్రమణదారులతో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండడం వల్ల వన్యప్రాణుల కోసం నీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సిబ్బంది కోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రతిఒక్కరి సమస్యను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. సిబ్బంది సంక్షేమంతో పాటు వారు సౌకర్యంగా విధులు నిర్వహించేందుకు పలు రకాల పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎర్రచందన స్మగ్లింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగర వనాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వీలైనంత నగర వనాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దాదాపుగా పూర్తి కావస్తున్న నెల్లూరు నగరవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అటవీ ప్రాంతం అన్యాక్రాంతం కాకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ అటవీ భూముల్లో ఎక్కడా అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలని, ఒకవేళ ఇలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే వెంటనే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ చంద్రశేఖర్, నెల్లూరు, ఆత్మకూరు, రాపూరు, ఉదయగిరి, కావలికి చెందిన రేంజర్లు మల్యాద్రి, రామకొండారెడ్డి, రవీంద్రబాబు, ఉమామహేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ధర్మపరిరక్షణ వారోత్సవాలు

• దేవస్థానం చైర్మన్ సురేంద్రరెడ్డి



నెల్లూరు రూరల్ : రూరల్ మండలంలోని నరసింహకొండపై ఉన్న శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం నుంచి హిందూ ధర్మ పరిరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. దేవస్థానంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వారోత్సవాల్లో హిందూ మత విశిష్టతను వివరించడం, స్వామి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కండలేరులో 11.381 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.381 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ తెలియజేశారు.



# ప్రజా చైతన్యంతో బాల్యవివాహాల నిర్మూలన



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట) : బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల పట్ల ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే వాటిని పూర్తిగా నిర్మూలించవచ్చని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. సచివాలయాల వారీగా గ్రామ, వార్డు స్థాయిలో బాల్య వివాహాల నిరోధక కమిటీల ఏర్పాటు నవంబర్ 1వ తేదీకి ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన 1098 టోల్‌ఫ్రీ నంబర్‌పై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జరిగే సమాఖ్య సమావేశాలకు హాజరయ్యే స్వయం సహాయ మహిళా సంఘాల సభ్యులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. సచివాలయాల పరిధిలోని వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. అలాగే బాలికల వివరాలను క్లస్టర్ వారీగా, సచివాలయం వారీగా రూపొందించి మహిళా సంరక్షణ కార్యదర్శి ద్వారా మానిటరింగ్ జరిగేలా చూడాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో సంబంధిత సచివాలయాల మహిళా పోలీసులు, పరిపాలనా కార్యదర్శులు, ఎంపీడీఓలు బాధ్యత తీసుకుని బాల్య వివాహాలను నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో లవన్న, నెల్లూరు ఆర్డీఓ మాలోల, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, డీఈఓ గంగాభవాని, అడిషనల్ ఎస్పీ ప్రసాద్, ఐటీడీఏ పీఓ మందారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి విజయ్ వినీల్‌కుమార్, చైతన్యజ్యోతి తదితరులు ఉన్నారు.

# నిబంధనలను తప్పక పాటించండి



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్



హాజరైన ఎన్నికల అధికారులు, సిబ్బంది

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో జనాభా నిష్పత్తికి తగ్గట్లుగా యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని, ఎన్నికల సంఘం నియమాలను తప్పక పాటించాలని ఎన్నికలాధికారులకు కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో ఎన్నికల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని, క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాను రూపొందించడంలో బీఎల్ఓలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్ర పరిధిలో బౌండరీస్‌ను కచ్చితంగా నిర్ణయించుకుని, జనాభా నిష్పత్తి, లింగ నిష్పత్తి, కొత్త ఓటర్ల నమోదు, వివిధ క్లయిమ్‌లను పారదర్శకంగా పరిగణించాలని ఆదేశించారు. ఓటర్లు–జనాభా నిష్పత్తిలో ఉన్న తేడాను తగ్గించేందుకు, జనకూడలి ప్రాంగణంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరచాలన్నారు. ఓటరును పోలింగ్ కేంద్రం నుంచి బదిలీ చేసే సందర్భంగా కుటుంబ సభ్యుల వారీగా ఓట్లను విడదీయవద్దని, జనాభాకు తగ్గట్లుగా ఓటర్ల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిష్పత్తిని సమం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులకు రాజకీయ పార్టీల బీఎల్ఏలను సమన్వయం చేసుకుని జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా సరి చూసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో ఏఈఆర్ఓలు నిర్మలానందబాబా, దేవీకుమారి, దశయ్య, ధనుంజయ, ఈడీటీ మాధవి, చక్రపాణి, సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# నేత్రపర్వం నృసింహుని కల్యాణం

రాపూరు : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో మంగళవారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఏపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఆరురోజులుగా దేవదేవేరుల కల్యాణం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చివరి రోజు పెంచలకోనలో స్వామి అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండలంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం జరిపించారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

## నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ | : రూ.115 |
| లేయర్ | : రూ.113 |
| బ్రాయిలర్ చికెన్ | : రూ.204 |
| స్కిన్‌లెస్ చికెన్ | : రూ.226 |
| లేయర్ చికెన్ | : రూ.192 |

## పొదలకూరు నిమ్మధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.65 |
| సన్నవి | : రూ.30 |
| పండ్లు | : రూ.7 |



# సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక కార్యాచరణ

• కలెక్టర్ హరినారాయణన్



నెల్లూరు (దర్గామిట్ట) : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని పనిచేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆయన చాంబర్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులతో మంగళవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులతో పాటు పది నుంచి 19 ఏళ్ల విద్యార్థినులకు రక్తపరీక్షలు చేసి రక్తహీనత ఉన్నవారిని గుర్తించి, హిమోగ్లోబిన్ శాతం పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులకు నెలకోసారి, విద్యార్థినులకు మూడు నెలలకోసారి ఈ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నవంబర్ మొదటి వారంలో ఈ ప్రక్రియ మొదలు పెట్టాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిప్యూటీ డీఈఓలు, సీఆర్‌పీలు పాఠశాలలను పరిశీలించి మౌలిక వసతులకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఐసీడీఎస్‌కు సంబంధించి బరువు తక్కువ, రక్తహీనత ఉన్న పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించి, మూడు నెలల తరువాత మార్పును గమనించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, ట్రెయినీ కలెక్టర్ సంజన సిన్హా, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, రాష్ట్రీయ బాలల సమితి ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్ఐఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశానికి గడువు పొడిగింపు

మర్రిపాడు : కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గానూ 9, 11 తరగతుల ప్రవేశం కోసం దరఖాస్తు గడువు 31తో ముగిసిందని, నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ వారి ఆదేశాలతో నవంబర్ 7వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం విద్యాలయ హెల్ప్ డెస్క్ నంబర్లకు 89850 07588, 94935 14644 సంప్రదించాలని కోరారు.